సాక్షి
కరీంనగర్
శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023

ఆర్టీసీ ఉద్యోగుల సంబరాలు

కరీంనగర్: టీఎస్ ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ ఆమోదం తెలిపిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామని ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ ఎం.థామస్‌రెడ్డి తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడాన్ని హర్షిస్తూ గురువారం వన్‌డిపో ఎదుట సంబరాలు జరుపుకున్నారు. డిపో మేనేజర్ ఎం.మల్లేశం, లక్ష్మీరాజం, రవీందర్, జీపీసింగ్, రవీందర్, మనోహర్, శంకర్‌రెడ్డి, సాగర్, ఏవీఆర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గరిష్టం/కనిష్టం
30.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడా స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల స్వీకరణ



అవార్డు తీసుకుంటున్న మల్లీశ్వరి

గన్నేరువరం/రామడుగు: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023కు సంబంధించిన అవార్డులు గన్నేరువరం మండలం ఖాసీంపేట, రామడుగు మండలం వెలిచాల గ్రామపంచాయతీలు దక్కించుకున్న విషయం తెలిసిందే. గురువారం హైదరాబాద్‌లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా ఖాసీంపేట సర్పంచ్ గంప మల్లీశ్వరి, వెలిచాల సర్పంచ్ వీర్ల సరోజన అవార్డులు స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో పవన్‌కుమార్, డీఆర్‌డీవో పీడీ శ్రీలత, డీపీవో వీరబుచ్చయ్య, ఎంపీడీవో స్వాతి, ఎంపీవో నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫలితాలు ప్రజలకు చేరాలి



సప్తగిరికాలనీ(కరీంనగర్): ప్రస్తుతకాలంలో సైన్స్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని, సైన్స్ ఫలితాలు ప్రజలకు చేరాలని డీఈవో సీహెచ్ జనార్దన్‌రావు తెలిపారు. స్థానిక సైన్స్ మ్యూజియంలో గురువారం నిర్వహించిన సెమినార్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సైన్స్ అధికారి చాడ జయపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 30మంది విద్యార్థులు హాజరైనట్లు వివరించారు. ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన ఒకరిని రాష్ట్రస్థాయికి ఎంపికచేయనున్నట్లు ప్రకటించారు. డీసీఈబీ కార్యదర్శి స్వదేశ్‌కుమార్, నోడల్ అధికారి కోట లక్ష్మారెడ్డి, బాలల జాతీయ కాంగ్రెస్ అకాడమిక్ కో–ఆర్డినేటర్ కేఎస్.అనంతచార్య, ఓపెన్ స్కూలు కో ఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అమలులోకి మద్దతు ధరలు

కరీంనగర్‌అర్బన్: పంట ఉత్పత్తులకు నూతన ధరలను కేంద్రం ఖరారు చేసిందని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ తెలిపారు. గ్రేడ్ ఏ ధాన్యం క్వింటాల్‌కు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183గా నిర్ణయించగా జొన్నలు(హైబ్రిడ్) రూ.3,180, సజ్జలు రూ.2,500, మొక్కజొన్న రూ.2,090, రాగులు రూ.3,846, కందులు రూ.7,000, పెసలు రూ.8,558, మినుములు రూ.6,950, వేరుశనగ రూ.6,377, పొద్దుతిరుగుడు రూ.6,760, పసుపు రూ.4,600, నువ్వులు రూ.8,635, గడ్డి నువ్వులు రూ.7,734, పత్తి మీడియం రూ.6,620, లాంగ్ స్టేపుల్‌కు రూ.7,020 ఖరారు చేసిందని వెల్లడించారు.

నేడు వైద్యకళాశాల ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి కేసీఆర్
- రేకుర్తి నుంచి కళాశాల వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ
- పాల్గొననున్న మంత్రి గంగుల కమలాకర్, వినోద్‌కుమార్, ప్రముఖులు

ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి గంగుల కమలాకర్, కలెక్టర్ గోపి, వినోద్ కుమార్, మేయర్ సునీల్‌రావు, తదితరులు



కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ప్రభుత్వ వైద్యవిద్య కళాశాల ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. శుక్రవారం(నేడు) ఉదయం 11 గంటలకు సీఎం కేసీఆర్ హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా కళాశాలను ప్రారంభించనున్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రత్యక్షంగా కార్యక్రమంలో పాల్గొననున్నారు.

రేకుర్తి నుంచి ర్యాలీ

కొత్తపల్లిలో మెడికల్‌కాలేజీ ప్రారంభం సందర్భంగా 25వేల మంది విద్యార్థులతో 9గంటలకు రేకుర్తి నుంచి ర్యాలీ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే అన్ని కళాశాలల విద్యార్థులను తరలించేందుకు ఆదేశాలు జారీ అయ్యాయి. విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొననున్నారు.

16 నుంచి తరగతులు

కరీంనగర్ మెడికల్ కళాశాల ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. అన్ని వసతులతో ఈనెల 16నుంచి తరగతులు నిర్వహించేందుకు సిద్ధం చేశారు. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం అనాటమీ డిసెక్షన్, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ సబ్జెక్టులకు సంబంధించిన తరగతులు ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో క్లినికల్, నాన్ క్లినికల్ బోధన, వైద్యం తదితర విభాగాలకు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంటు ప్రొఫెసర్లను నియమించారు.

అందుబాటులోకి వైద్యసేవలు

జిల్లాలో మెడికల్ ప్రారంభమైన తర్వాత అన్ని రకాల సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇప్పటి వరకు సాధారణ వైద్య సేవలు మాత్రమే అందాయి. ఇక నుంచి కార్డియాలజీ, న్యూరాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ వంటి సేవలు ప్రజలకు ఉచితంగా అందుబాటులోకి రానున్నాయి.

ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి కమలాకర్

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించనున్న కొత్తపల్లిలోని మెడికల్ కళాశాల ఏర్పాట్లను రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శుక్రవారం ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రభుత్వ వైద్య కళాశాలను ఉదయం 11.00గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. ఉదయం 9.00గంటలకు రేకుర్తి బ్రిడ్జి నుంచి మెడికల్ కళాశాల వరకు భారీ ర్యాలీ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మంత్రి వెంట రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, మేయర్ వై.సునీల్ రావు, కలెక్టర్ డాక్టర్ బి.గోపి, సీపీ సుబ్బారాయుడు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలొస్తే కరీంనగర్ నుంచే పోటీ

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్



మట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ నుంచే పోటీ చేస్తానని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రకటించారు. మంత్రి గంగుల కమలాకర్‌తో కుమ్మక్కయినట్లు జరుగుతున్న దుష్ప్రచారాన్ని కొట్టిపారేశారు. తాను పార్లమెంట్ సమావేశాలు, అమెరికా పర్యటనలో ఉండడంతోనే కోర్టుకు హాజరుకాలేకపోయానని తెలిపారు. గురువారం కరీంనగర్‌లోని తన నివాసంలో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి దీక్షను భగ్నం చేసి, కార్యకర్తలపై పోలీసుల దాడిని ఖండించారు. రాష్ట్రాన్ని రూ.5.5 లక్షల కోట్ల అప్పుల పాలుజేసి, కేసీఆర్ చెల్లని రూపాయిలా మారారని ఎద్దేవా చేశారు. ఓవైసీ చెబితేనే సెప్టెంబర్ 17న జాతీయ సమైక్యతా దినోత్సవంగా ప్రకటించారని ఆరోపించారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరిపి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. తాను ఎక్కడి నుంచి పోటీ చేయాలనే విషయంలో క్లారిటీ ఉందని, ఎంపీ, అసెంబ్లీ ఎన్నికలు వేర్వేరుగా జరిగితే కరీంనగర్ అసెంబ్లీ నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేశారు. కరీంనగర్‌లో గంజాయి ఏరులై పారిస్తూ యువతను చిత్తు చేస్తున్నా పోలీసులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. పోలీసులు గంజాయిని కంట్రోల్ చేయని పక్షంలో తామే యువకులతో దళాలను ఏర్పాటు చేసి కట్టడిచేస్తామని ప్రకటించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులే ఉండబోరనే హామీ ఏమైంది?

రాష్ట్రంలో కాంట్రాక్ట్ ఉద్యోగులే ఉండబోరని ప్రకటించిన కేసీఆర్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల శిబిరం వద్దకు వెళ్లి సంఘీభావం తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వేయి మంది ఓటర్లకు ఒక అధికారి



కరీంనగర్ అర్బన్: ఓటరు జాబితాలో వేయి మంది ఓటర్లకు ఒక పరిశీలన అధికారిని నియమించినట్లు కలెక్టర్ బి.గోపి తెలిపారు. ఈ నెల 19లోగా పకడ్బందీగా ఓటరు జాబితా రూపొందించాలని తహసీల్దార్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఓటర్ల నమోదు, సవరణలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, తహసీల్దార్లతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రంవారీగా 18ఏళ్లు పైబడిన వారందరు ఓటర్లుగా గుర్తించబడాలని అన్నారు. జాబితాలో లేని వారిని ఫామ్–6 ద్వారా నమోదు చేయాలని తెలిపారు. పొరపాటున తొలగించిన ఓటర్ల వివరాలను సరిచూడడానికి ప్రతి వేయిమందికి ఒక క్లస్టర్ అధికారిని నియమించడం జరిగిందని తెలిపారు. తహసీల్దార్‌లు బీఎల్‌ఓలతో సమావేశాలను నిర్వహించి అర్హులైన వారందరిని ఓటర్లుగా గుర్తించబడేలా క్షేత్రస్థాయిలో పరిశీలించేలా ఆదేశాలను జారీచేయలని ఈ సందర్భంగా సూచించారు.

ఆపదలో ఉన్న మహిళలకు సాయంగా ఉండాలి

కరీంనగర్: ఆపదలో ఉన్న మహిళలకు సాయం అందించడానికి సఖీకేంద్రం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ బి.గోపి సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సఖీ జిల్లా మేనేజ్‌మెంట్ 9వ సమావేశంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలు ఇబ్బందులు, ఆపదలో ఉంటే 181 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. సఖీ కేంద్రానికి వచ్చే కేసుల్లో ఆలస్యం లేకుండా సత్వరం పరిష్కరించాలని అన్నారు. ఇన్‌చార్జి డీఆర్వో పవన్ కుమార్, ఏడీసీపీ రాజు, మెప్మాపీడీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

‘టెట్’కు సర్వం సిద్ధం

- నిమిషం ఆలస్యమైతే ఇంటికే
- పేపర్–1కు 9,646, పేపర్–2కు 8,836మంది అభ్యర్థులు
- ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

కరీంనగర్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం 9.30గంటల నుంచి 12గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు పేపర్–2 పరీక్ష జరుగనుంది. జిల్లావ్యాప్తంగా పేపర్–1కు 9,646 మందికి 41 కేంద్రాలు, పేపర్–2కు 8,836మంది అభ్యర్థులకు 38కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు 41మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 41మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 123మంది హాల్ సూపరింటెండెంట్లు, 533మంది ఇన్విజిలేటర్లు, ఏడుగురు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. పరీక్షకేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు అమర్చారు. కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరు.

నిమిషం ఆలస్యమైతే ఇంటికే

టెట్‌కు హాజరయ్యే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 8.30గంటలకు చేరుకోవాలి. ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని డీఈవో జనార్దన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. హాల్‌టికెట్లపై ఫొటో, సంతకం లేకుంటే.. ఒకఫొటో అతికించి దానిపై గెజిటెడ్ అధికారితో సంతకం చేయించుకుని, ఆధార్‌కార్డుతో పరీక్షకు హాజరుకావాలని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే 78160 69121 నంబర్‌ను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. టెట్ పరీక్ష జరిగే విద్యాసంస్థల్లో శుక్రవారం సెలవు ప్రకటించినట్లు తెలిపారు. కొత్తపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభోత్సవం సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలను దృష్టిలోపెట్టుకొని పేపర్–1కు ఉదయం 8.30 లోగా, పేపర్–2కు మధ్యాహ్నం 2.15లోగా హాజరు కావాలని సూచించారు.

క్లుప్తంగా

ప్రయాణికుల భద్రతే లక్ష్యం

కరీంనగర్‌క్రైం: ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా బస్టాండులో సీసీ కెమెరాల ఏర్పాటుతో ప్రత్యక్షంగా నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్ అన్నారు. కరీంనగర్ బస్టాండులో గురువారం వన్‌టౌన్ సీఐ రవికుమార్, ఆర్టీసీ విజిలెన్స్ అధికారుల ఆధ్వర్యంలో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. పనిచేయని సీసీ కెమెరాలను తీసివేసి కొత్తవి అమర్చాలని ఆదేశించారు. వన్‌టౌన్ ఎస్సై రవి, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలు..

సప్తగిరికాలనీ(కరీంనగర్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ బాలబాలికలకు 5 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి మేరి యేసుపాదం తెలిపారు. వీటీజీసెట్, బీఎల్‌వీసీఈటీ పరీక్ష రాసి సీటు వచ్చి జాయిన్ కాలేని వారికి, ఎస్సీ ఆర్ఫన్, ఎస్సీ సెమీ ఆర్ఫన్, ఎస్సీ వికలాంగులకు అలాగే వీటీజీసెట్, బీఎల్‌వీసీఈటీ పరీక్ష రాసి సీటు రాని వారికి ప్రాధాన్యత ఇవ్వబడునని పేర్కొన్నారు. విద్యార్థులు సీటు వచ్చిన కాపీ, హాల్ టికెట్స్, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్స్ పత్రాలతో ఈ నెల 23న చింతకుంటలోని బాలికల గురుకుల పాఠశాల, బాలురు సీఈఓ అల్గునూర్ పాఠశాలకు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని తెలిపారు.

ఆర్టీసీ విలీనం పూర్తి చేయాలి


డాక్టర్ కె. నగేశ్

చొప్పదండి: ఆర్టీసీ విలీనం బిల్లును ఎందుకు ఆలస్యం చేస్తున్నారో ప్రజలకు చెప్పాలని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె. నగేశ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే విలీనం ప్రక్రియ ఆగిపోతుందని ఆందోళన వెలిబుచ్చారు. ఆర్టీసీ కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని గవర్నర్, ముఖ్యమంత్రి ఇద్దరూ చర్చించి విలీనం ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. సీసీఆర్ నుంచి రూ.450 కోట్లు కార్మికుల డబ్బు ఆర్టీసీ యాజమాన్యం వాడకుందని, తక్షణమే సదరు డబ్బు, వడ్డీ సీసీఆర్‌లో జమ చేయాలని కార్మికుల పక్షాన డిమాండ్ చేశారు.

మరింత సహకారం

- అన్ని విభాగాలు ఒకేశాఖ పరిధిలోకి
- మండలానికో బ్యాంకు.. యువతకు ఉద్యోగాలు
- అన్నదాతకు ఉపయుక్తం


కరీంనగర్ జిల్లా సహకార కేంద్రం బ్యాంకు

కరీంనగర్ అర్బన్: సహకార సంఘాల వ్యవస్థ మరింత బలోపేతమవుతోంది. అన్నదాతలకు సేవలతో పాటు వాణిజ్య రంగాల్లోనూ తనదైన పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులు సేవలందిస్తుండగా సహకార సంఘాలు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాయి. రైతుల పెట్టుబడులతో వారి సంక్షేమమే లక్ష్యంగా ఏర్పడిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు ఏటా పురోభివద్ధి బాటలో పయనిస్తున్నాయి. తాజాగా అన్నిశాఖలను ఒకే గొడుగు కిందకు తీసుకొస్తున్నారు. తద్వారా రైతులకు మరింత నాణ్యమైన సేవలు అందుతాయని అధికారులు వివరిస్తున్నారు. దీనికితోడు మండలానికో బ్యాంకును ఏర్పాటు చేయనుండగా తదనుగుణ ప్రతిపాదనలకు కేడీసీసీబీ సిద్ధమవుతోంది.

ఇన్నాళ్లూ ప్రాథమికానిదే ప్రముఖ పాత్ర

సహకారశాఖ పరిధిలో గొర్రెల పెంపకందారుల, విశ్వబ్రాహ్మణ, రజక, నాయీబ్రాహ్మణ, పద్మశాలి, గృహ నిర్మాణ, స్వశక్తి తదితర సహకార సంఘాలన్నీ కొనసాగుతున్నాయి. ఈశాఖ పరిధిలో ఇన్నాళ్లు ప్రాథమిక సహకార సంఘాలదే ప్రముఖ పాత్ర. ఇక మీదట పరస్పర సహకార చట్టం, తెలంగాణ సహకార చట్టాల పరిధిలో సహకార శాఖ పరిధిలోకే వస్తాయి. దీని ద్వారానే సంఘాలను నమోదు చేస్తారు. ఆర్బీఐ నుంచి నాబార్డు, రాష్ట్రస్థాయిలో అపెక్స్ బ్యాంక్, జిల్లా స్థాయిలో డీసీసీబీ ద్వారా సహకార సంఘాలకు నిధులు బదలాయిస్తారు.

ఏటా రూ.వేయి కోట్ల లావాదేవీలు

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఏటా రూ.వేయి కోట్ల లావాదేవీలతో జిల్లాలో చురుకుగా పని చేస్తున్నాయి. రైతులకు అన్ని రకాల ఎరువులను విక్రయిస్తుండగా, పంట, దీర్ఘకాలిక, బంగారం, వాహన, వ్యక్తిగత, శ్రీవిద్యా రుణాలను అందిస్తున్నాయి. జిల్లా సహకారశాఖ ఆధ్వర్యంలో 50 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 2,36,832 క్వింటాళ్ల ధాన్యం సేకరణతో సంఘాలు ఆర్జిస్తూ సేవలందిస్తున్నాయి.

12 మండలాల్లో బ్యాంకుల ఏర్పాటు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 62 మండలాలతో సిద్దిపేట, భూపాలపల్లి, వరంగల్ అర్బన్ జిల్లాల్లో విలీనమైన మండలాలు 8వరకు ఉన్నాయి. కాగా ఇప్పటివరకు 67 బ్యాంకుల్లో 85 వేల మంది ఖాతాదారులుండగా రూ.2000కోట్ల లావాదేవీలు అందిస్తున్నాయి.
- ఇందులో రూ.1,000 కోట్ల రుణాలు ఇస్తుండగా రూ.350 కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. మూడు నుంచి అయిదు మండలాల రైతులు ఒకే బ్యాంకు పరిధిలో సేవలు పొందడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.
- ఈ నేపథ్యంలో కొత్త బ్యాంకుల ఏర్పాటుపై టెస్కాబ్ అధ్యయనం చేసి మండలానికో బ్యాంకు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేసింది. ఇది కార్యరూపం దాలిస్తే రైతులకు మరింత ప్రయోజనం చేకూరనుంది.
- కరీంనగర్ జిల్లాలో కొత్తపల్లి, ఇల్లందకుంట మండలాల్లో బ్యాంకులు ఏర్పడనుండగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల రూరల్, రుద్రంగి, వీర్నపల్లి, వేములవాడ రూరల్, పెద్దపల్లి జిల్లాలో అంతర్గాం, పాలకుర్తి, రామగిరి, జగిత్యాల జిల్లాలో జగిత్యాల రూరల్, బుగ్గారం, బీర్పూర్ మండలాల్లో కొత్తగా బ్యాంకులు ఏర్పడనున్నాయి. ఈ నేపథ్యంలో యువతకు ఉద్యోగాలు అందనున్నాయి.
- కాగా రైతులకు పంట పెట్టుబడి అందించే రుణాలు ఇవ్వడం దగ్గర నుంచి ధాన్యం కొనుగోలు వరకు రైతులకు ఎన్నో రకాల సేవలు అందిస్తున్నాయి. రాయితీపై విత్తనాలు, ఎరువులు అందిస్తున్నాయి.
- రైతులకు పంట రుణం ఇవ్వడం దగ్గర నుంచి దీర్ఘకాలిక, ఇతర రుణాలు అందజేస్తూ సాగులో అభివృద్ధికి డీసీసీబీ సహకారం అందిస్తోంది. దీర్ఘ కాలిక రుణాలు, స్వయం ఉపాధి, వ్యవసాయ అనుబంధ రంగాలకు ఉపాధి పొందేందుకు అవసరమైన రుణాలతోపాటు డెయిరీ, చేపల పెంపకం, ట్రాక్టర్లు, వరి కోత యంత్రాలు, వ్యవసాయ పరికరాలు రాయితీపై అందిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ప్రాథమిక సహకార సంఘాలు	: 128
సహకార కేంద్ర బ్యాంకు శాఖలు	: 67
బ్యాంకు ఉద్యోగులు	: 552
సొసైటీ ఉద్యోగులు	: 1,700

అన్నదాతకు మరింత చేరువ

మండలానికో బ్యాంకు ఏర్పాటు వల్ల రైతులకు సేవలు మరింత దగ్గరనున్నాయి. ఇప్పటికే వివిధ రకాల సేవలతో అగ్రగామిగా కొనసాగుతున్నాం. కొత్త మండలాల్లో బ్యాంకు ఏర్పాటుతో యువతకు ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.
– సత్యనారాయణరావు, సీఈవో, కేడీసీసీబీ

వేధింపులు ఆపాలి: ఏఐటీయూసీ


మాట్లాడుతున్న సమ్మయ్య

కరీంనగర్: అంగన్‌వాడీల సమ్మె పట్ల రాష్ట్ర ప్రభుత్వ వేధింపులు వెంటనే ఆపివేసి సమస్యల పరిష్కారానికి మార్గం చూడాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య ప్రభుత్వానికి హితవు పలికారు. అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా గురువారం కలెక్టరేట్ నుంచి జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ముట్టడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 60 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాల్సింది పోయి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బీఎల్‌వో డ్యూటీలు చేయాలనడం, వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని వేధించడం, అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టడం, కేంద్రాల్లోని సరుకులను పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పంచడం సరికాదన్నారు. అంగన్‌వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించి పర్మినెంట్ చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రజిత, డి.రజిత, నాయకులు భారతి, అరుణ, అనురాధ, విజయ, శారద, అంజలి, కరుణ, శైలజ, కవిత, పద్మ, సంధ్య పాల్గొన్నారు.

‘అనభేరి’ స్ఫూర్తితో పోరాడుదాం


అనభేరి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కరీంనగర్: అనభేరి ప్రభాకర్‌రావు స్ఫూర్తితో పోరాడుదామని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా గురువారం కరీంనగర్లోని వెంకటేశ్వర ఆలయం ఎదుట గల అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహానికి సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభాకర్‌రావు విగ్రహం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీని వాసుదేవారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. బైకు యాత్ర అనభేరి స్వగ్రామం తిమ్మాపూర్ మండలం పోలంపల్లి వరకు చేరుకుంటుందన్నారు. బానిసత్వానికి వ్యతిరేకంగా ప్రభాకర్‌రావు పేదలను ఐక్యం చేసి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ముందుండి తుపాకి పట్టి నైజాం నవాబులను ఎదుర్కొని తొలి అమరుడయ్యాడని గుర్తు చేశారు. నగరంలోని అన్ని విగ్రహాలను సుందరీకరించి, వాటర్ ఫౌంటేన్ ఏర్పాటుచేసి అనభేరి విగ్రహాన్ని విస్మరించారని, ఇలాంటి వివక్షత తగదని హెచ్చరించారు. ఇప్పటికైనా నగరపాలక కమిషనర్, మేయర్ స్పందించి అనభేరి విగ్రహాన్ని ఆధునీకరించి ప్రభుత్వమే అధికారికంగా వర్ధంతి, జయంతి కార్యక్రమాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై అమరవీరుల స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వర్ణ వెంకటరెడ్డి, గుడి కందుల సత్యం, గీట్లముకుందరెడ్డి, జి.బీమాసాహెబ్, యు.శ్రీనివాస్, ఎడ్ల రమేష్, నరేష్‌పటేల్, జి.తిరుపతి, కె.నాగమణి, పుల్లెల మల్లయ్య, రాయికంటి శ్రీనివాస్, కాంపెల్లి అరవింద్, గజ్జల శ్రీకాంత్, శివకుమార్, నవీన్, అభినవ్, జగదీష్, మల్లారెడ్డి, ఆకాష్, రవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మ్యానువల్ పద్ధతిలో బదిలీలు చేపట్టాలి

కరీంనగర్: ఎస్‌జీటీ ఉపాధ్యాయుల బదిలీలు మ్యానువల్ పద్ధతిలో జరపాలని ఎస్‌జీటీ ఫోరం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అలుమల్ల అనిల్‌కుమార్ రెడ్డి, శిరందాసు రామదాసు ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ విధానంలో చాలా పాఠశాలలు ఎంపిక చేయాల్సి ఉన్నందున మహిళా ఉపాధ్యాయులు రవాణా సౌకర్యాలు లేని ప్రాంతాల గురించి చాలా కంగారు పడుతున్నారన్నారు. మ్యానువల్ పద్ధతిలో బదిలీలు జరిపితే పాఠశాల వివరాలు తెలుసుకొని నచ్చిన పాఠశాలలను ఎంపిక చేసుకొనే అవకాశం ఉంటుందని, ఆన్‌లైన్‌లో అయితే గతంలో చాలా ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. అక్రమాలు జరుగకుండా, పోస్టులు బ్లాక్ చేయకుండా మ్యానువల్‌గా ఉపాధ్యాయులను కౌన్సెలింగ్ పిలిచి సీనియారిటీ ఆధారంగా కోరుకున్న పాఠశాలలకు ఆన్‌లైన్‌లో అప్పటికప్పుడు బదిలీ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు మ్యానువల్ పద్ధతిలో బదిలీలు జరిపించుటకు ఎమ్మెల్సీలు, అన్ని సంఘాల రాష్ట్ర నాయకులు కృషి చేయాలన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి


మద్దతు తెలుపుతున్న జైపాల్‌రెడ్డి

కరీంనగర్: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొత్త జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం 14వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవేనని సీఎం కేసీఆర్ పరిష్కరించాలని కోరారు. లేకుంటే 2024లో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, తమ ప్రభుత్వ హయంలో సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి దుర్గం శ్రీనివాస్, సీఆర్పీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండా రాజిరెడ్డి, ఎంఐఎస్‌లు దీప్తి, సుకన్య, రజని, కంప్యూటర్ ఆపరేటర్ల జిల్లా అధ్యక్షుడు జిలాని, కనుకుల రమేష్, మహేష్, అశోక్, అయోధ్య, శ్రీనివాస్, ప్రభాకర్, రవిచంద్ర, బీస రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


మన్నా రియాజ్

కరీంనగర్‌స్పోర్ట్స్: కర్ణాటక రాష్ట్రంలో శుక్రవారం నుంచి జరగనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్స్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి మన్నా రియాజ్ ఎంపికైనట్లు ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి గణపతి తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రియాజ్‌ను ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, కరీంనగర్ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి కీర్తి రాజవీరు, ఫుట్‌బాల్ సంఘం బాధ్యులు నూతి శ్రీధర్, తాండ్ర శంకర్, అంతటి శంకరయ్య తదితరులు అభినందించారు.

వైన్ షాపుల్లో చోరీ

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండలకేంద్రంలోని రెండు వైన్స్‌షాపుల్లో బుధవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీసాయినాథ్, శ్రీ మారుతి వైన్స్ నిర్వాహకులు బుధవారం రాత్రి 10 గంటలకు షాపును మూసివేసి ఇంటికెళ్లారు. గురువారం ఉదయం 10గంటలకు షాపు తీయగా దుకాణం వెనుక వైపు తలుపులను బద్దలుకొట్టి మద్యం కాటన్లు పక్కకు జరిపి చిందరవందరగా పడేసి ఉన్నాయి. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చోరీ జరిగిన తీరును పరిశీలించారు. శ్రీసాయినాథ్ షాపులో రూ.26 వేలు, రూ.8వేల విలువగల మద్యం బాటిల్స్, శ్రీమారుతీ వైన్స్‌లో రూ.55 వేల నగదు, రూ.5వేల విలువగల మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లారు. వైన్స్ యజమానులు గాండ్ల సంపత్, పూరెల్లి రాకేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జమ్మికుంట పరిధిలో..

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని ఓ వైన్స్‌లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వైన్స్ నిర్వాహకుల వివరాల ప్రకారం.. కొత్తపల్లిలోని వావిలాల రోడ్డులో గల సిరి వైన్స్‌లో క్యాష్ కౌంటర్‌లో రూ.50 వేలు, విలువైన మద్యం బాటిళ్లను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ రమేశ్ తెలిపారు.

ప్రాణం తీసిన ఆన్‌లైన్ యాప్

- అప్పు తీర్చాలంటూ నిర్వాహకుల ఒత్తిడి
- ఉరేసుకొని సింగరేణి కార్మికుడి ఆత్మహత్య


మార్చురీలో వంశీకృష్ణ మృతదేహం

పెద్దపల్లిరూరల్: ఏడాదిక్రితం సింగరేణిలో బదిలీపిల్లర్ (ఆర్జీ–ఏఎల్‌పీ)గా ఉద్యోగం పొంది భవిష్యత్తును ఆనందంగా గడపాల్సిన పల్లె వంశీకృష్ణ(26) ప్రాణాలను ఆన్‌లైన్ యాప్ బలిగొంది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. ఓదెల మండలం కొలనూర్‌కు చెందిన వంశీకృష్ణ తండ్రి రాయమల్లు సింగరేణి కార్మికుడిగా పనిచేస్తూ అనారోగ్యంతో మరణించగా.. ఆ ఉద్యోగాన్ని ఏడాదిక్రితం పొందిన వంశీ మకాం పెద్దపల్లికి మార్చాడు. పట్టణంలోని చీకురాయి రోడ్డులో నివాసముంటున్న సమయంలో గుర్తుతెలియని ఆన్‌లైన్ యాప్ నుంచి కొంత రుణం పొందాడు. ఆ తర్వాత తిరిగి చెల్లించినా ఇంకా బాకీ ఉన్నావంటూ నిర్వాహకులు వంశీకృష్ణపై ఒత్తిడి పెంచారు. ఆ తర్వాత తన ఫొటోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో బంధు, మిత్రులందరికీ షేర్ చేసి పరువు తీస్తామంటూ బెదిరింపులకు దిగారని కుటుంబీకులు ఆరోపించారు. ఆన్‌లైన్ యాప్ నిర్వాహకుల వేధింపులు తాళలేక మనస్తాపానికి గురైన వంశీకృష్ణ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని వివరించారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు సైబర్‌నేరంగా కేసు నమోదు చేసి సైబర్‌క్రైం పోలీసులకు బదిలీ చేస్తున్నామని ఎస్సై వివరించారు.

దుబాయి నుంచి వచ్చి.. భార్య ప్రియుడిని చంపి..

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో యువకుడి దారుణ హత్య
- నిందితుల కోసం ముమ్మర గాలింపు
- లుక్‌ఔట్ నోటీస్ జారీ చేసిన పోలీసులు
- మల్యాలలో విషాదం


పడిగెల నరేశ్(ఫైల్)


రోదిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు


హత్య జరిగిన తీరును డీఎస్పీకి వివరిస్తున్న సీఐ

చందుర్తి(వేములవాడ): భార్యతో వివాహేతర సంబంధం నెరుపుతున్నాడని తెలుసుకున్న భర్త దుబాయి నుంచి వచ్చి యువకుడిని హత్య చేశాడు. ఈ సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మల్యాలలో సంచలనం సృష్టించింది. గ్రామస్తులు, చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాలు. మల్యాలకు చెందిన పడిగెల నరేశ్(27) అదే గ్రామానికి చెందిన వివాహిత(32)తో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలిసిన వివాహిత బావ కుమారుడు లక్ష్మణ్ దుబాయ్‌లో ఉంటున్న ఆమె భర్త మల్లేశంకు తెలిపాడు. ఈనెల 3వ తేదీన గల్ఫ్ నుంచి వచ్చిన మల్లేశం ఇంటికిరాకుండా ఎక్కడో తలదాచుకున్నాడు. నరేశ్‌ను చంపేందుకు అదును కోసం ఎదురుచూస్తున్నాడు. బుధవారం రాత్రి నరేశ్ సదరు వివాహిత ఇంట్లోకి వెళ్లడం గమనించిన బావ కొడుకు లక్ష్మణ్ ఆమె భర్త మల్లేశంకు సమాచారం అందించాడు. మల్లేశం మాస్కులు ధరించి బైక్‌పై ఇంటికి చేరుకుని.. భార్యతో ఇంట్లో ఉన్న యువకుడిపై కత్తితో దాడి చేశాడు. మంచం పై నుంచి కింద పడ్డ నరేశ్‌పై పదే..పదే కత్తితో దాడి చేయగా తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వెంటనే హత్యకు పాల్పడ్డ వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. హత్య విషయం తెలుసుకున్న చందుర్తి సీఐ కిరణ్‌కుమార, పలువురు ఎస్సైలు బుధవారం అర్ధరాత్రి ఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించారు. మల్లేశం కోసం పరిసర ప్రాంతాల్లో గాలించారు. హత్య జరిగేందుకు మరో నలుగురు సహకరించారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి గురువారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. మృతుని తల్లి లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ వివరించారు.

సాయంత్రం విందు.. అర్ధరాత్రి హత్య

పడిగెల నరేశ్‌కు అదే గ్రామానికి చెందిన వివాహితతో ఐదేళ్ల క్రితమే వివాహేతర సంబంధం ఏర్పడింది. అదే సమయంలో వివాహిత కుటుంబ సభ్యులకు, యువకుడి మధ్య గొడవలు జరుగడంతో నరేశ్ దుబాయి వెళ్లాడు. అక్కడే ఐదేళ్లపాటు ఉన్నాడు. గత ఆగస్టు 29న ఇంటికొచ్చిన నరేశ్ తిరిగి సదరు వివాహితతో వివాహేతర సంబంధం కొనసాగించాడు. ఇది గమనించిన వివాహిత భర్త అన్నలతోపాటు వారి కుమారుడు ఈ విషయాన్ని గల్ఫ్‌లో ఉంటున్న మల్లేశంకు తెలిపారు. ఈనెల 3న దుబాయి నుంచి ఇండియా వచ్చిన మల్లేశం బంధువుల ఇంట్లో తలదాచుకున్నాడు. ముందస్తు పథకం ప్రకారం వివాహిత కుటుంబ సభ్యులు బుధవారం యువకుడి ఇంట్లోనే విందు చేసుకున్నారు. తర్వాత యథావిధిగా ఎవరి ఇంటికి వారు వెళ్లిపోయారు.బంధువుల ఇంట్లో తలదాచుకున్న మల్లేశంను అదే సమయంలో స్వగ్రామానికి పిలిపించుకున్నారు. ఇది తెలియని యువకుడు రాత్రి అందరూ పడుకున్న సమయంలో వివాహిత వద్దకు వెళ్లాడు. గమనించిన లక్ష్మణ్ తన చిన్నాన్న మల్లేశంకు ఫోన్ చేయడంతో బైక్‌పై వచ్చి యువకుడిపై దాడి చేసి హత్యకు పాల్పడ్డాడు.

అనుమానితులను విచారిస్తున్న పోలీసులు

ఈ హత్యలో ప్రధాన నిందితుడిగా ఉన్న మల్లేశం పరారీకాగా.. అనుమానం ఉన్న ముగ్గురితోపాటు వివాహితను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. హత్యకు సహకరించిన వారి వివరాలను కాల్‌డాటా ఆధారంగా సేకరిస్తున్నట్లు సమాచారం. వారం క్రితమే హత్యకు పథకం రచించినట్లు తెలిసింది.

పోలీసుల లుక్‌ఔట్ నోటీసు

యువకుని హత్యలో ప్రధాన నిందితునిగా భావిస్తున్న మల్లేశ దుబాయి నుంచి ఈనెల 3న ఇండియాకు వచ్చాడు. హత్య చేసేందుకు ముందుగానే తిరిగి దుబాయి వెళ్లేందుకు సిద్ధమై.. రాత్రి 11 గంటల ప్రాంతంలో హత్యచేసి ఎయిర్‌పోర్టుకు అదే రాత్రి వెళ్లిపోయాడన్న ప్రచారంతో పోలీసులు లుక్‌ఔట్ నోటీస్ జారీ చేసినట్లు తెలిసింది.